www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 3 జూలై 2024
5
పశ్చిమ గోదావరి

అతిసారపై అవగాహన కల్పించండి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మహేశ్వరరావు

పాలకోడేరు : వర్షాకాలంలో తాగునీరు కలుషితం అవ్వడం ద్వారా అతిసార సోకే ప్రమాదం ఉందని, వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి అతిసారపై ప్రతీఒక్కరికి అవగాహన కల్పించి పిల్లలకు రక్షణ కల్పించే విధంగా తోడ్పడాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ మహేశ్వరరావు అన్నారు. పాలకోడేరులో మంగళవారం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ రంగనాయుడు, మరో వైద్యురాలు డాక్టర్ స్వర్ణసిరంజని ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో డిఎంహెచ్‌ఒ డాక్టర్ మహేశ్వరరావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ సీజన్‌లో 5 సంవత్సరాలలోపు పిల్లలకు అతిసార సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ప్రతీఒక్కరూ కాచిచల్లార్చిన నీటిని తాగటం ద్వారా అతిసార నుంచి విముక్తి పొందవచ్చని తెలిపారు. ఎవరికైనా వాంతులు, విరోచనాలు అవుతున్నట్లు అయితే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

పెరుగుతున్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు..!

బయట కొనుగోలు చేసేందుకు ఆసక్తి - అధికారుల తనిఖీలు నిల్ -రోగాల బారిన జనం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పట్టణంతో పాటు గ్రామాల్లో సైతం ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మారుతున్న జీవన శైలిలో భాగంగా ఫాస్ట్‌ఫుడ్ అందరికీ వరంగా మారింది. ఇంటి వద్ద చేసుకునే సమయం లేక ఉద్యోగులు, విద్యార్థులు, కార్మికులు, మహిళలు ఇలా అన్ని వర్గాల ప్రజలు బయట ఫుడ్ కొనుగోలుకు అలవాటు పడ్డారు. దీంతో రోగాలను కొని తెచ్చుకుంటున్నారు.

పెరిగిన బిర్యానీ, కర్రీ పాయింట్లు..

పట్టణాల్లోనే కాకుండా గ్రామాల్లో సైతం బిర్యానీ, పలావ్, ఫ్రై ఐటమ్స్ అమ్మకాలు బాగా పెరిగాయి. రుచిగా ఉండటం, ఇంట్లో చేసుకునే సమయం లేక వాటి కొనుగోళ్లు బాగా పెరిగాయి. ఆయా ఆహార పదార్థాల్లో ప్రమాదకర టేస్టింగ్ సాల్ట్ వాడతారని తెలిసినా వాటి కొనుగోళ్లు తగ్గని పరిస్థితి నెలకొంది. ఇంట్లో వండుకునే కంటే కర్రీ పాయింట్లలో కొనుగోలుకు జనం ఆసక్తి చూపుతున్నారు. పాలకొల్లు రూరల్ ప్రాంతాలైన లంకలకోడేరు, ఎస్.చిక్కాల, జిన్నూరు, పోడూరు, పెనుమదం, గుమ్ములూరు, మేడపాడు, యలమంచిలి, చించినాడ, దొడ్డిపట్ల, వల్లూరు ఇలా అనేక ప్రాంతాల్లో కర్రీ పాయింట్లు, బిర్యానీ సెంటర్లు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఉదయం దుకాణాల్లో టిఫిన్ దొరక్క పోయినా సాయంత్రం మాత్రం తప్పక ఫాస్ట్‌ఫుడ్ దొరుకుతుండటే వీటి అమ్మకాలు ఎంత జోరుగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. రోజువారీ పనులు చేసుకునే తాపీ మేస్త్రీ, వడ్రంగి, బంటా కార్మికులు, డ్రైవర్లు, విద్యార్థులు, ఉద్యోగులు ఇలా అన్ని వర్గాల ప్రజలూ వీటిని కొనుగోలు చేస్తున్నారు. దీంతో టిఫిన్ సెంటర్లు కన్నా ఇవి ఎక్కువగా అందుబాటులో ఉన్నాయి. దీంతో ఆసుపత్రుల్లో రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ప్రభుత్వాసుపత్రితోపాటు పట్టణంలోని ప్రయివేట్ ఆసుపత్రుల్లో బెడ్లు దొరకని పరిస్థితి ఉంది. నడవక పోవడం, శారీరక శ్రమ లేకపోవడంతోపాటు ఇటువంటి ఆహారానికి అలవాటు పడడంతో యువకులు సైతం గుండె పోటుకు గురవుతున్నారు. ఆసుపత్రుల్లో రోగుల సంఖ్య పెరగడానికి ఫాస్ట్‌ఫుడ్ ఒక కారణమని వైద్య నిపుణులు చెబుతున్నారు. అయితే నాణ్యతలేని ఫాస్ట్‌ఫుడ్ అమ్మకాలు జోరుగా సాగుతున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు.

పాలకొల్లు పరిసర గ్రామంలో ఫాస్ట్‌ఫుడ్ అమ్మకాలు

ఫాస్ట్‌ఫుడ్ ప్రమాదకరం..

సంతోష్ కుమార్, పిల్లల వైద్య నిపుణులు, పాలకొల్లు

ఇంటి వద్ద ఆహారం అందుబాటులో ఉన్నా యువత బయట ఫాస్ట్‌ఫుడ్‌కు అలవాటు పడుతున్నారు. ఇది ప్రమాదకరం. ఎక్కువగా ఉడికిన ఆహార పదార్థాలు తీసుకోవాలి. ఆయిల్, మసాలాలు, మాంసాహార ఆహారం బయట ఎక్కువగా తీసుకోకూడదు. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం.

బయట ఆహారానికి జనం మొగ్గు..

ముత్యాల నరసింహారావు, ప్రయివేట్ ఉద్యోగి, పాలకొల్లు

ఇంట్లో ఆహారం కంటే బయట ఆహారం రుచిగా ఉండటంతో ఎక్కువ మంది ఆకర్షితులవుతున్నారు. చూడడానికి అందంగా, ఆకర్షణీయంగా ఉండడం కూడా కారణం. పండ్ల రసాలు వద్ద కన్నా బ్రాందీ షాపుల వద్ద యువత ఎక్కువగా ఉండడం మంచిది కాదు.

ఖరీఫ్‌లో నీటి ఆటంకాలు రాకూడదు

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఖరీఫ్ సాగులో నీటిపారుదలకు ఆటంకం లేని విధంగా అవసరమైన పనులను వెంటనే చేపట్టాలని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి జల వనరుల శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరం వద్ద జిల్లా కలెక్టర్ సి.నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్ ఆదిత్యతో కలిసి సాగునీటి పనులపై జల వనరుల శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సి.నాగరాణి మాట్లాడుతూ ఖరీఫ్ సాగులో శివారు భూములకు సైతం సాగు నీటి ఎద్దడి ఏర్పడకుండా అవసరమైన పనులను వెంటనే చేపట్టాలన్నారు. ముఖ్యంగా కాలువల్లో, డ్రెయిన్లలో నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా గుర్రపుడెక్క, కిక్కిస తొలగింపు వంటి అత్యవసరమైన పనులను మొదటి దశలో చేపట్టాలన్నారు. ఇప్పటికే వీడ్ రిమూవల్ కోసం ఒఅండ్‌ఎం కింద పనులు మంజూరయ్యాయని, త్వరితగతిన టెండర్లు పూర్తిచేసి పనులను ప్రారంభించాలని తెలిపారు. తొలగించిన తక్ష గట్లపై వేయకుండా దూరంగా తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తాడేపల్లిగూడెం, తణుకు, ఉండి, నరసాపురం సబ్ డివిజన్ పరిధిలో లాకుల కొత్త అమర్చడం, కొన్ని రిపేర్లు చేయడం వంటి 49 పనులకు సంబంధించి రూ.5.79 కోట్లకు ఒఅండ్‌ఎం కింద నిధుల మంజూరుకు ప్రతిపాదనలను పంపామని జల వనరుల శాఖ అధికారులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. అలాగే తాడేపల్లిగూడెం సబ్ డివిజన్ పరిధిలో ఒఅండ్‌ఎం కింద 49 పనులు తూడు తొలగింపునకు మంజూరయ్యాయని, ఈనెల 4న టెండర్లకు చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు. కాలువల్లో పూడికతీతకు సంబంధించి 20 పనులు మంజూరయ్యాయని కెనాల్స్ ఇఇ దక్షిణామూర్తి తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నీటిపారుదలకు ఆటంకంగా ఉన్న ప్రదేశాలను తొలుత గుర్తించి కిక్కిస, గుర్రపు డెక్క తొలగింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. ఏ పని చేపట్టినా సంబంధిత ప్రాంతాల్లోని రైతులకు ముందుగా తెలియజేసి, వారి సమక్షంలో పనులు చేపట్టాలని జల వనరుల శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పనుల నాణ్యత ఎట్టి పరిస్థితుల్లో తగ్గకూడదని, ఖర్చు చేసే ప్రతి పైసా పూర్తిగా సద్వినియోగం అయ్యేలా పనులను చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సివి ప్రవీణ్ ఆదిత్య, జిల్లా జల వనరుల శాఖ అధికారి ఎవివి.కిషోర్, కెనాల్స్ ఇఇ ఎం.దక్షిణామూర్తి, గోదావరి హెడ్ వాటర్ వర్క్స్, రిజర్వ్ కన్జర్వేటర్ ఇఇ ఆర్.కాశీ విశ్వేశ్వరరావు, డిఇలు, ఏఇలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజును ఆదర్శంగా తీసుకోవాలని వసుధ పౌండేషన్ కో ఆర్డినేటర్, రిటైర్డ్ డిఇఇ ఇందుకూరి ప్రసాద్‌రాజు తెలిపారు. అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి, 127వ జయంతిని భీమవరంలోని జువ్వలపాలెం రోడ్డులో అల్లూరి స్మృతివనం వద్ద ఈ నెల 4వ తేదీన నిర్వహిస్తున్నట్లు శతవర్ధంతి నిర్వహణ కమిటీ తెలిపింది. ఈ మేరకు స్థానిక అమరవీరుల స్తూపం వద్ద మంగళవారం జరిగిన సమావేశంలో వసుధ పౌండేషన్ కో ఆర్డినేటర్, రిటైర్డ్ డిఇఇ ఇందుకూరి ప్రసాద్‌రాజు మాట్లాడారు. ఈ నెల 4వ తేదీన పెద్దఎత్తున జరిగే ఈ కార్యక్రమంలో బాలలు, యువతీ, యువకులు, పెద్దలు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని ఘన నివాళులు, జోహార్లు అర్పించాలని విజ్ఞప్తి చేశారు. అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్టు చైర్మన్ బి.బలరాం మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల్లో అగ్రగణ్యుడు, తెలుగుజాతి ముద్దుబిడ్డ అల్లూరి సీతారామారాజు 127వ జయంతి, ఈ సంవత్సరం అల్లూరి సీతారామరాజు ప్రాణ త్యాగం చేసిన శతవర్ధంతి అని, జీవించింది 27 సంవత్సరాలే అయినా చేసిన త్యాగం చరిత్రలో చెరగని ముద్రవేసిందని, అటువంటి త్యాగశీలికి ఘనంగా నివాళులు, జోహార్లు అర్పించాలని అందరినీ కోరారు. ఈనెల 4వ తేదీన అల్లూరి స్వగ్రామం మోగల్లు నుంచి పెద్ద ఎత్తున మోటార్ సైకిళ్ల ర్యాలీ, జిల్లాలో ఆకివీడు, తాడేపల్లిగూడెం, నర్సాపురం నుంచి కూడా మోటార్ సైకిళ్ల ర్యాలీలు భీమవరం చేరుకుంటాయని తెలిపారు. అనంతరం సభ, ప్రజానాట్య మండలి, బాల బాలికలతో నృత్య కళా ప్రదర్శనలు, భీమవరం ఆర్కెస్ట్రా కళాకారుల గేయాలాపానల మధ్య ఘనంగా నివాళులు, జోహార్లు అర్పిస్తూ సభ జరుగుతుందని బలరాం తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని ప్రజానీకమంతా పాల్గొని జోహార్లు అర్పించాల్సిందిగా కోరుతున్నాం. ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్టు కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, జి.జేమ్స్, రిటైర్డ్ ఉద్యోగులు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎ.రవివర్మ, సబ్ ట్రెజరర్ ఆఫీసర్, పి.సీతారామరాజు, భీమవరం రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సెక్రటరీ సిహెచ్.రామారావు, కె.చంద్రరావు, పివిఆర్ఎస్ సూర్యనారాయణ పాల్గొన్నారు. డి.భీమవరం కళాకారుల అసోషియేషన్ మోహన్ మాట్లాడుతూ బ్రిటీషువారి తూటాలకు ఎదురెళ్లి తన ప్రాణాలను అర్పించిన అల్లూరి సీతారామరాజు వంటి మహాయోధుడికి నివాళులర్పించే అవకాశాన్ని కల్పించిన శతవర్ధంతి కమిటీకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. తమ వంతు మద్దతు, సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రజలంతా పాల్గొనాలని కళాకారుల అసోషియేస్ తరపున తెలిపారు.



మాట్లాడుతున్న వసుధ పౌండేషన్ కో ఆర్డినేటర్ ప్రసాద్‌రాజు

పట్టిసీమ ప్రాజెక్టు

ఇక 'పట్టిసీమ'పరవళ్లు..!

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పట్టిసీమ ఎత్తిపోతల పథకం మళ్లీ పరవళ్లు తొక్కనుంది. కృష్ణా డెల్టాలోని ఖరీఫ్ ఆయుకట్టుకు సాగునీరు విడుదలకు ప్రభుత్వం సిద్ధమైంది. బుధవారం ఉదయం 7.27 గంటలకు పట్టిసీమ నుంచి సాగునీటిని జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు విడుదల చేయనున్నారు. గోదావరి నుంచి ఏటా 3 వేల టిఎంసిలు నీరు వృథాగా పోవడంతో, పోలవరం నిర్మాణం పూర్తయ్యే వరకూ వరద నీటిని ఉపయోగించుకునేందుకు పట్టిసీమ నిర్మాణం చేపట్టారు. 2014లో టిడిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2015లో కృష్ణా జిల్లాలోని దాదాపు 13 లక్షల ఎకరాలకు ఖరీఫ్‌లో సాగునీరు అందించాలని గోదావరి గట్టుపై పట్టిసీమ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ఏడాది కాలంలోనే దాదాపు రూ.1300 కోట్లతో ఈ ప్రాజెక్టును టిడిపి ప్రభుత్వం అప్పట్లో పూర్తిచేసింది. టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నంతకాలం ఏటా దాదాపు 80 టిఎంసిల వరకూ పట్టిసీమ ద్వారా నీటిని తరలించిన పరిస్థితి ఉంది. మొత్తం 24 పంపులతో పంప్‌హౌస్ ఏర్పాటు చేస్తూ ఈ ప్రాజెక్టును నిర్మించారు. ఈ పంపుల ద్వారా నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న కుడి కాలువలోకి నీటిని ఎత్తిపోసేవిధంగా ప్రాజెక్టు రూపకల్పన జరిగింది. ఒక్కో పంపు నుంచి 354 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసే విధంగా రూపొందించారు. మొత్తం 8,500 క్యూసెక్కుల నీటిని తోడేవిధంగా ఈప్రాజెక్టును నిర్మాణం చేశారు. గోదావరిలో కనీస నీటిమట్టం ప్లస్ 14 మీటర్లు ఉన్నప్పుడు మాత్రమే నీటిని తోడేవిధంగా ఈ ప్రాజెక్టును నిర్మించారు. టిడిపి ప్రభుత్వంలో ఈ ప్రాజెక్టు నుంచి నీటి తోడకం పెద్దఎత్తున జరిగినప్పటికీ వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత నిలిపివేసింది. 2020, 21, 23లో నీటి అవసరం రావడంతో కొద్దిమేర మాత్రమే నీటితోడకం చేసింది. పట్టిసీమ నీటివిడుదలతో ఏలూరు జిల్లాలోని పెద్దపాడు, దెందులూరు ప్రాంతాల్లోని సాగుకు సైతం సాగునీరు అందించే అవకాశం ఉంది. గతంలో ఆ విధంగా చేసిన పరిస్థితి కొనసాగింది. తొలిరోజు వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేసి తర్వాత పెంపు చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. కృష్ణా, పశ్చిమ రైతులకు పట్టిసీమ నీరు ఉపయోగపడనుంది.

నేడు కృష్ణా డెల్టాకు పట్టిసీమ నీరు విడుదల

గత ప్రభుత్వం పట్టిసీమను పట్టించుకోని పరిస్థితి

టిడిపి ప్రభుత్వం రావడంతో మళ్లీ నీటి విడుదలకు సన్నాహాలు

4న దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్ : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

నీట్ పరీక్ష రద్దు చేసి, ఈ పరీక్షపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 4న చేపట్టనున్న దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని విద్యార్థి సంఘాల నేతలు పిలుపునిచ్చారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల అధిపతులు బంద్‌లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక సిఎస్ఎన్ కళాశాలలో మంగళవారం ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ సంఘాల ఆధ్వర్యంలో బంద్ కరపత్రాలను నాయకులు ఆవిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్ మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్‌టిఎను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నీట్ స్కాంపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. దేశంలో పాఠశాల విద్య చాలా దారుణంగా ఉందన్నారు. ఇప్పటివరకూ దేశంలో దాదాపు 61,885 ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయన్నారు. వాటిని వెంటనే తెరవాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష రద్దు చేయాలన్నారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రవేశ పరీక్ష ఫలితాల కోసం కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ మీద రోజు రోజుకు నమ్మకం సన్నగిల్లుతోందన్నారు. ఈ విద్యా సంవత్సరం (ఎన్‌టిఎ విడుదల చేసిన పరీక్ష ఫలితాలపై, పేపరు లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలన్నారు. ఈ మేరకు ఈ నెల నాలుగో తేదీన విద్యాసంస్థల బంద్‌కు ప్రయివేటు, ప్రభుత్వ విద్యాసంస్థల అధిపతులు సంపూర్ణ మద్దతు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బి.గణేష్, జి.శ్రీను, ఎఐఎస్ఎఫ్ నాయకులు పి.పవన్, ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు ఎన్.పవన్, ఎన్.సాయి, డి.ప్రణీత్ పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నేతలు

ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఆక్వా రైతుల సమస్యలపై ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో ఆక్వా రైతులు రొయ్యలు, చేపలను కష్టపడి పండిస్తున్నారని తెలిపారు. ఆక్వా రైతుల కృషి వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయం కూడా వస్తుందన్నారు. పన్నుల రూపంలో విదేశీమారక ద్రవ్యం రూపంలో వేల కోట్లు ఆదాయాలు ప్రభుత్వాలు పొందుతున్నాయన్నారు. కానీ పండించే ఆక్వా రైతులు మాత్రం తీవ్ర నష్టంలో ఉన్నారన్నారు. గత ప్రభుత్వం కనీసం ఆక్వా రైతులను పట్టించుకోలేదన్నారు. విద్యుత్ రాయితీ, నాణ్యమైన సీడ్స్ సరఫరా, ఫీడ్ ధరలు నియంత్రణ వంటి అనేక హామీలు ఇచ్చి ఆక్వా రైతులను మోసం చేశారని మండిపడ్డారు. బడా సంస్థలు ఏకమై ఆక్వా రైతులకు సరైన ధరలు రాకుండా చేస్తున్నారని, దీనివల్ల రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని తెలిపారు. దీనివల్ల రైతు నష్టాల ఊబిలో చిక్కుకున్నా కనీసం వైసిపి ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఆక్వా రైతుల పట్ల చిన్న చూపు చూస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం, ఎంపెడ, ఫిషరీస్ డవలప్మెంట్ బోర్డు, రాష్ట్ర ప్రభుత్వం, మత్స్య శాఖ ఆక్వా రైతుల సమస్యలను పట్టించుకొని పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఏర్పడిన నూతన ప్రభుత్వం ఆక్వా రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఆక్వా సాగుకు అన్ని విధాలా సహకారం చేయాలని కోరారు. ఆక్వా రైతుల సమస్యలపై రైతాంగం చేసే ఉద్యమాలకు, పోరాటాలకు సిపిఎం సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని తెలిపారు.

అధికారులు రాజకీయాలు చేస్తే సహించను : ఎంఎల్ఎ

వీరవాసరం: పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో రాజకీయం చేస్తే సహించేది లేదని, ఇక్కడ పని చేయడం ఇష్టంలేకపోతే వెళ్లిపోవచ్చునంటూ భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) హెచ్చరించారు. వీరవాసరం మండల అభివృద్ధి సమీక్ష సమావేశాన్ని మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ శాఖలవారీ సమీక్ష నిర్వహించారు. మండలంలో ముఖ్యంగా తాగునీరు, సాగునీరు, విద్యుత్ సమస్యలున్నట్టు ఎంఎల్ఎ గుర్తించారు. తాగునీరు, సాగునీరు, విద్యుత్ సమస్యల పరిష్కారానికి తన మొదటి ప్రాధాన్యత ఇస్తానని ఎంఎల్ఎ అన్నారు. తక్షణమే తాగునీరు సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధులు కొరకు అంచనాలు తయారు చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇని ఆదేశించారు. ఇదేవిధంగా పంట కాలువ, మురుగు కాలువలలో తూడు తొలగించడానికి షార్టు టెండ్‌లు, నామినేషన్ పద్ధతిలో సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలంటూ ఇరిగేషన్ ఎఇని ఆదేశించారు. వీరవాసరం పశువైద్యశాల పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని ఎంపిటిసి గుళ్లిపల్లి విజయలక్ష్మీ, వైద్యాధికారి ప్రియాంక రాబర్ట్ ఎంఎల్ఎ దృష్టికి తీసుకొచ్చారు. వీరవాసరం పంచాయతీకి పర్మినెంట్ కార్యదర్శిని నియమించాలంటూ ఎంపిటిసి గుళ్లిపల్లి విజయలక్ష్మీ ఎంఎల్ఎను కోరారు. మండలంలో రూ.36 కోట్లుతో రోడ్డు వేయడానికి అంచనాలు రూపొందించామంటూ ఆర్అండ్‌బి ఎఇ మూర్తి ఎంఎల్ఎకు తెలిపారు. అనంతరం మండల పరిషత్ నిధులు రూ.8 లక్షలతో మండల పరిషత్ కార్యాలయం అభివృద్ధికి శిలాఫలకం ఆవిష్కరించారు.

నీట్ స్కామ్‌పై సమగ్ర విచారణ జరపాలి

పిడిఎస్‌యు, ఎస్ఎఫ్ఐ పిలుపు

తాడేపల్లిగూడెం: ఐక్య విద్యార్థి సంఘాలు పిలుపు మేరకు ఈనెల 4న దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్ పిలుపులో భాగంగా తాడేపల్లిగూడెంలోని అన్ని కాలేజీలకు, స్కూళ్లకు బంద్ నోటీసులు అందజేసినట్లు పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు రూప శంకర్, జిల్లా నాయకులు శ్రీను, ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు నాగేంద్ర, కార్యదర్శి రవి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయు ఎం.సత్యనారాయణకు బంద్ నోటీసులు అందజేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్‌డియే జాతీయస్థాయి పరీక్షలు నిర్వహించడంలో విఫలమైందని, నీట్ స్కాంపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయన్నారు. ఈనెల 4న జరిగే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని విద్యాసంస్థలకు విజ్ఞప్తి చేశారు.

నరసాపురం: నీట్ పరీక్ష రద్దుచేసి ఈ పరీక్షపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలని ఈనెల 4వ తేదీన నిర్వహిస్తున్న బంద్‌కు మద్దతు తెలపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు తెలిపారు. వివిధ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌లో భాగంగా నరసాపురంలో అన్ని ప్రభుత్వ, ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల అధిపతులు తమ సంస్థలను సంపూర్ణంగా బంద్ చేసి ఈ బంద్‌లో భాగస్వామ్యం కావాలన్నారు.

పంట కాలువల్లో గుర్రపు డెక్క నివారణకు చర్యలు తీసుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్

ఆచంట:గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పంట కాలువల మురుగు, డ్రెయిన్లలో పేరుకుపోయిన చెత్తాచెదారం, గుర్రపు డెక్క నివారణకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ తెలిపారు. మంగళవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజవర్గంలో ఆచంట, పోడూరు, పెనుగొండ మండలాల పరిధిలో నక్కల డ్రెయిన్ విస్తరించి ఉండడంతో వర్షాకాలం వచ్చిందంటే రైతులకు కంటిమీద కునుకు ఉండటం లేదన్నారు. గత దశాబ్ద కాలంలో డ్రెయిన్ ఆధునీకరించిన అనంతకాలంలోనే అక్రమాలు, పూడికలతో పరిస్థితి మొదటికొచ్చిందన్నారు. కొద్దిపాటి వర్షం వచ్చిందంటే పంట పొలాలు ముంపు బారిన పడటం నియోజకవర్గంలో ఆనవాయితీగా మారిపోయిందని విమర్శించారు. ఒక్క డ్రెయిన్ పరిధిలోనే సుమారు 25 వేల ఎకరాల పంట భూములు ముంపు బారిన పడే ప్రమాదం ఉందన్నారు. తక్షణమే అధికారులు స్పందించి పంట కాలువల్లోనూ, డ్రెయిన్‌లలోనూ దట్టంగా పెరిగిపోయిన చెత్తాచెదారం, గుర్రపు డెక్కను తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు ఎస్‌విఎన్.శర్మ, పి.మోహన్ రావు, నాయకులు వర్ధిపర్తి శ్రీనివాసరావు, తలుపూరి బుల్లబ్బాయి పాల్గొన్నారు.

నక్కల కాలువను ఆధునికీకరించాలని వినతి

పాలకొల్లు : జిల్లాలోని పెరవలి మండలం కాకరపర్రు నుంచి యలమంచిలి మండలం వడ్డిలంక వరకు ఉన్న నక్కల కాలువను తక్షణం ఆధునికీకరించాలని, వడ్డిలంక వద్ద ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ ఉపయోగించి ముంపు నీరు బయటకు తోడేలా శాశ్వత పరిష్కారం చేపట్టాలని, భూయజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు, కౌలురైతు సంఘాల ఆధ్వర్యంలో జిల్లా జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు మాట్లాడుతూ యలమంచిలి, పోడూరు, ఆచంట పెనుగొండ మండలాలను ఆనుకొని ఉన్న నక్కల మురుగు కాలువను ఆనుకొని అనేక గ్రామాల్లో వేలాది ఎకరాల్లో ప్రధానంగా వరి, కూరగాయలు, ఆక్వా పంటలు సాగుచేస్తున్నారని, వరదల సమయంలో రైతులు, కౌలురైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. మంత్రి నిమ్మల మాట్లాడుతూ నక్కల కాలువ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని, కౌలురైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం

ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ

రోటరీ క్లబ్‌కు అవార్డులు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం రోటరీ క్లబ్‌కు పలు విభాగాల్లో 13 అవార్డులు లభించాయని రోటరీ క్లబ్ అధ్యక్షురాలు గన్నాబత్తుల సత్యవతి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ విజయవాడలో ఆదివారం కన్వెన్షన్ హాలులో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన రోటరీ క్లబ్ సభ్యులను సత్కరించినట్లు తెలిపారు. క్లబ్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామన్నారు. బెస్ట్ సోషల్ సర్వీస్ క్యాటగిరీలో డిమాండ్ అవార్డులను రోటరీ డిస్ట్రిక్ట్ 3020 గవర్నర్ దత్త సుబ్బారావు మెమొంటో సర్టిఫికెట్ అందించారన్నారు. 4 కేటగిరీల్లో గోల్డెన్ అవార్డ్, 6 కేటగిరీల్లో సిల్వర్ అవార్డ్ సాధించామన్నారు. తొలిసారిగా రోటరీ క్లబ్‌కి అవార్డ్ రావడానికి కారణమైన గన్నాబత్తుల సత్యవతిని క్లబ్ సభ్యులు ప్రశంసించారు.

కొనసాగిన పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - ఆచంట

ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమం మండలంలో మంగళవారం కూడా కొనసాగింది. ఆచంట మండలం కరుగోరుమిల్లి గ్రామానికి చెందిన వి.మసేన్ రావు, చింతపల్లి జనార్ధన్‌లు రాజమండ్రి బొల్లినేని హాస్పిటల్‌లో వైద్య చికిత్స పొందుతున్నారు. అలాగే అదే గ్రామానికి చెందిన మల్లుల నాగమణి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతూ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో కరుగోరుమిల్లి గ్రామ సర్పంచ్ భర్త అల్లం సూర్య ప్రకాష్, టిడిపి నాయకులు బండి సత్యవర ప్రసాద్, నారాయణ చికిత్స పొందుతున్న బాధితులకు పెన్షన్ అందజేశారు.

ఉచిత షుగర్ రక్త పరీక్షా శిబిరం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం లయన్స్ క్లబ్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ ఆధ్వర్యం లయన్స్ పసుమర్తి హనుమంతరావు(అనిల్) ఆర్థిక సహకారంతో కడకట్ల నందలి జనతా చారిటబుల్ ట్రస్ట్ హాస్పిటల్‌లో మంగళవారం ఉచిత షుగర్ రక్త పరీక్ష శిబిరాన్ని లయన్స్ పసుమర్తి చంద్రశేఖర శ్రీనివాసరావు(చందు) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కూడా తాడేపల్లిగూడెం లయన్స్ క్లబ్ సభ్యుడు నైనందుకు గర్వ పడుతున్నానని, మీరు చేస్తున్న మంచి కార్యక్రమాలకు తన తోడ్పాటు ఎప్పుడూ వుంటుందని అన్నారు. ఈ శిబిరంలో మొత్తం 87 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జోన్ ఛైర్‌పర్సన్ సుంకర శ్రీనివాసరావు, తాడేపల్లిగూడెం లయన్స్ క్లబ్ సెక్రటరీ చిన్నం జగదీష్, కోశాధికారి భీమవరపు మహాలక్ష్మి, జనతా డాక్టర్ నర్సింహరావు, మంచంరి రామ మోహన్ రావు, సన్నిధి సూర్యనారాయణ మూర్తి, పచ్చా వెంకటేశ్వరరావు, పడాల మహేశ్వర రావు, రామకృష్ణ, వెంకటేశ్వరరావు, ఆంజనేయ స్వామి పాల్గొన్నారు.

నెగ్గిపూడిలో పేదలకు అన్నదానం

ప్రజాశక్తి - పెనుమంట్ర

పంచ గ్రామ రెడ్డి సంఘం అన్నదాత ట్రస్ట్ వారిచే ప్రతిరోజూ పేదలకు దాతల సహకారంతో గత 866 రోజులుగా నిరంతరాయంగా భోజనం వితరణ కార్యక్రమం నిర్విఘ్నంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కాగా మంగళవారం దాతలు నెగ్గిపూడికి చెందిన ఎస్‌విబి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల హెడ్ మాస్టర్ చిర్ల చిన సూర్యనారాయణ రెడ్డి, భార్య సుజాత పెళ్లిరోజు సందర్భంగా కుటుంబ సభ్యుల సహకారంతో ఏర్పాటు చేసిన భోజనాలు పంచ గ్రామ రెడ్డి సంఘ సభ్యులు పేదలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాతలకు పంచ గ్రామ రెడ్డి సంఘము వారు ధన్యవాదములు తెలిపారు.

చిన్నారులకు విద్యాసామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - మొగల్తూరు

విద్యార్థులు ఆటపాటలతో పాటు చదువులో కూడా రాణించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని టిడిపి నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు సూచించారు. మంగళవారం మండలంలోని ముత్యాలపల్లిలోని చింతేపేలలో ఉన్న ప్రాథమిక పాఠశాల అంగన్వాడీ చిన్నారులకు సామాజిక సేవాగాం టిడిపి నాయకులు నాగిడి రాంబాబు సమకూర్చిన పుస్తకాలు, విద్యాసామగ్రిని ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఐ.వి.ఎస్.చక్రవర్తి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గుడాల తాతారావు, బొక్క కోటేశ్వర ఉన్నారు.

పింఛన్ల పంపిణీ విజయవంతం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - తణుకు

ప్రజలకి ఇచ్చిన మాట తప్పకుండా నెరవేరుస్తున్న ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని తణుక నియోజకవర్గ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ కొనియాడారు. పింఛన్ల పంపిణీ విజయవంతం కావడంతో మంగళవారం ఉమ్మడి పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమం పండుగ వాతావరణాన్ని తలపించేలా ఉందన్నారు. ఉదయం 6 గంటల నుంచి పింఛనుదారుల ఇళ్ల వద్దకే పింఛన్లు రావడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. వృద్ధులకు, వితంతువులకు రూ.4వేలుతో పాటు ఏప్రిల్, మే, జూన్ నెలకి సంబంధించిన రూ.3వేలు మొత్తం కలిపి రూ.7 వేలు అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలగర వెంకటకృష్ణ, దొమ్మేటి వెంకటసుధాకర్, పితాని మోహన్, గోపిశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

'పండుగలా పింఛన్ల పంపిణీ'

పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతూ పింఛన్ల పంపిణీ పండుగలా జరిగిందని తణుకు వికలాంగుల సమాఖ్య అధ్యక్షులు వేంద్ర లక్ష్మణ్ అన్నారు. మంగళవారం స్థానిక కూటమి కార్యాలయం వద్ద వికలాంగుల పెన్షన్లు రూ.3 వేల నుంచి 6 వేలకు పంపిణీ చేసిన నేపథ్యంలో వికలాంగుల పింఛన్లదారులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పింఛన్లు పెంచి ఆదుకున్నందుకు గాను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణను అభినందించారు.

పాలకోడేరు : విస్సాకోడేరు గ్రామ సచివాలయ ఉద్యోగులు ఉద్యోగ సేవాతత్వాన్ని చాటుకుంటున్నారు. ఎన్‌టిఆర్ పింఛను భరోసా పథకంలో భాగంగా ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పింఛనుదారుల వద్దకు మంగళవారం వెళ్లి పింఛను నగదు అందజేశారు.

మాట తప్పనిది కూటమి ప్రభుత్వం

మాజీ మంత్రి పీతల సుజాత

ప్రజాశక్తి - వీరవాసరం

మాట తప్పకుండా ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న ప్రభుత్వం ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వమని మాజీ మంత్రి పీతల సుజాత అన్నారు. మంగళవారం రెండో రోజు కొనసాగిన పెన్షన్‌ల పంపిణీలో మాజీ మంత్రి పీతల సుజాత పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెంచిన పెన్షన్ మొత్తం వల్ల కలిగే ప్రయోజనాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్‌నాయుడు, టిడిపి నాయకులు రాయపల్లి వెంకట్‌లు పాల్గొన్నారు.

కోర్కెల దినోత్సవాన్ని విజయవంతం చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - మొగల్తూరు

ఈనెల పదిన నిర్వహించిన కోర్కెల దినోత్సవం విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ అవుట్‌సోర్సింగ్ కార్మికులకు పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం సిపిఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన ప్రభుత్వాలు లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అవుట్‌సోర్సింగ్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంలో నడపాలని తెలిపారు.

పాలమూరులో చోరీ

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని పొలమూరు గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి ఉపాధ్యాయుడు కడలి సత్యనారాయణ అద్దె ఇంట్లో చోరీ జరగ్గా పోలీసుల దర్యాప్తులో భాగంగా మంగళవారం భీమవరం నుంచి క్లూస్ టీమ్ వచ్చి వేలిముద్రలు సేకరించారు. బాధితుని కథనం ప్రకారం కొణితివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న సత్యనారాయణ పొలమూరులోని బ్రాహ్మణ చెర్వు-నౌడూరు రోడ్డులోని ఓ అద్దె ఇంట్లో ఉంటున్నారు. ఇటీవల వివాహం అయిన కుమార్తెను చూడ్డానికి శనివారం నాడు ఆమె అత్తవారిల్లు ఉన్న కర్నూలు జిల్లా నంద్యాల భార్యతో కలిసి శనివారం వెళ్లారు. సోమవారం ఉదయం ఇంటికి వచ్చే సరికి, వేసి వెళ్లిన తాళం పగిలి ఉండడం చూసి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇంట్లో సుమారు ఐదు కాసుల బంగారం, లక్ష రూపాయల వరకు నగదు, పెళ్లిలో కానుకలుగా వచ్చిన వెండి వస్తువులు చోరీలో దొంగలు తీసుకు వెళ్లారు. పెనుగొండ సిఐ ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

నూరుశాతం బకాయిలు వసూలు

లాభాల బాటలో కాళ్లకూరు సొసైటీ

కాళ్ల: సహకార సంఘాలు చాలా వరకు రుణ వితరణ, ఇతర సేవలకే పరిమితం అవుతున్నాయి. మరికొన్ని సంఘాలు రైతుల అవసరాలు, వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా వాణిజ్య సరళిలో తమ వ్యాపార కార్యకలాపాలను విస్తరిస్తూ సంఘం, రైతుల అభివృద్ధికి తోడ్పడుతున్నాయి. ఈ కోవకు చెందినదే కాళ్లకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం. రైతులకు సేవలందిస్తూ ఆదాయ మార్గాల వైపు దృష్టిసారిస్తుంది. చిన్న సంఘమైనా సేవల్లో ముందుంటూ రైతులు, ప్రజల మన్ననలు పొందుతోంది.

45 ఏళ్ల నుంచి ఎ గ్రేడ్..

కాళ్లకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం 45 ఏళ్ల నుంచి ఎ గ్రేడ్ తరగతి సొసైటీగా పేరుగాంచి ప్రగతి పథంలో పయనిస్తోంది. కాళ్లకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అంచలంచెల ప్రగతి సాధిస్తుంది. ఏటేటా తన లాభాలను పెంచుకుంటూ సహకారం, సేవల్లో జిల్లాలోనే ఆదర్శంగా నిలుస్తుంది.

28 ఏళ్లుగా బకాయిలు నూరుశాతం వసూలు..

28 ఏళ్లుగా సభ్యుల నుంచి రికవరీలో ప్రథమ స్థానం పొంది ఏటా అవార్డులు అందుకుంటోంది. మంచి దృక్పథంతో గ్రామీణ రైతులకు రుణాలు అందించే 1939లో పెన్మత్స వెంకట సోమరాజు కాళ్లకూరు సహకార సంఘాన్ని ఏర్పాటు చేశారు. సొసైటీ మొదటి అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 375 మంది సభ్యులతో ప్రారంభమైంది. 29 ఏళ్లపాటు ఏకధాటిగా ఏకగ్రీవంగా ఎన్నికై సొసైటీ అభివృద్ధికి తోడ్పడ్డారు. సంఘం తొలినాళ్లలో కేవలం వేల రూపాయల్లో మాత్రమే లాభాలను ఆర్జించేది. సొసైటీ అధ్యక్షుల పర్యవేక్షణ, సిబ్బంది పనితీరు, సభ్యుల సహకారంతో డిపాజిట్లు గణనీయంగా పెరిగాయి. 2023-2024వ సంవత్సరంలో రూ.18 కోట్ల 80 లక్షల 58 వేలు సంఘ సభ్యుల నుంచి వసూలు చేశారు. క్రాఫ్ లోన్స్ రూ.173.05, మధ్యవాయిదా అప్పులు రూ.5.55, ఒన్ ఫండ్ లోన్స్ రూ.1610.08, ఒన్ ఫండ్ కెసిసి అప్పులు రూ.40.53, కరోనా లోన్స్ రూ.51.73 మొత్తం 1880.58(18 కోట్ల 80 లక్షల 58 వేలు) గత 28 సంవత్సరాలుగా నూటికి నూరు శాతం బకాయిలు వసూలు చేశారు.

కాళ్లకూరు సొసైటీ భవనం

లాభాల బాటలో..

ప్రస్తుతం 2,657 మంది సంఘం సభ్యులు ఉన్నారు. డిపాజిట్లు రూ.19 కోట్ల 15 లక్షలు 26,892, షేర్ క్యాపిటల్ కోటి ఒక లక్ష 72 వేల రూపాయలు ఉంది. డిసిసిబిలో ఇన్వెస్ట్‌మెంట్స్ రూ.5 కోట్ల 61 లక్షల 63 వేల 612, డిసిసిబి బారోయింగ్స్ రూ.3 కోట్ల 50 లక్షల 35 వేల 564తో నడుస్తోంది. సంఘం లాభాల బాటలో పయనిస్తోంది.

వరి, ఆక్వా రంగం..

ఈ ప్రాంతంలో వరి, ఆక్వా రంగం విస్తరించింది. రైతులు కష్టపడేతత్వం ఉన్న వారు కావడంతో చేప, రొయ్యల సాగులో రాణిస్తున్నారు. సంఘ పరిధిలో కాళ్లకూరు, జువ్వలపాలెం, ఏలూరుపాడు గ్రామాల్లో ఉన్న రైతులకు, ప్రజలకు, వరి రైతులకు పంట రుణాలు, ఆక్వా రైతులకు ఫిష్ ఫీడ్ రుణాలు బ్యాంకు ద్వారా అన్ని రకాల రుణాలు అందిస్తుంది. డిసిసిబి వారికి సొసైటీ ప్రత్యేక శ్రద్ధతో సహకారం అందిస్తుంది.

వార్షిక టర్నోవర్ రూ.39.52 కోట్లు..

సహకార బ్యాంకులో రూ.39 కోట్ల 52 లక్షల 98 వేల వార్షిక టర్నోవర్ నడుస్తోంది. పంట రుణాలు, బంగారు ఆభరణాలు, చేపల మేత వివిధ రకాల రుణాలు మంజూరు చేస్తూ రైతులకు, ప్రజలకు చేయూతనిస్తూ రైతాంగాన్ని అన్నివిధాలా ఆదుకుంటూ సొసైటీని సభ్యులు ముందుకు నడిపిస్తున్నారు. కాళ్లకూరు, జువ్వలపాలెం, ఏలూరుపాడు గ్రామాల రైతులు, ప్రజలకు సేవలందిస్తోంది. రైతులకు రూ.18 కోట్ల 80 లక్షల 58 వేలు రుణాలు అందజేశారు.

మొబైల్ ఎటిఎం

రైతులు, ప్రజల కోసం డిసిసిబి ద్వారా మొబైల్ ఎటిఎం శనివారం కాళ్లకూరులో అందుబాటులో ఉంటోంది. అన్ని రకాల ఎటిఎం కార్డులు ఈ మొబైల్ ఎటిఎంలో ఉపయోగించుకోవచ్చు. జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఏలూరు వారు రూ.15 లక్షలతో ఏర్పాటు చేసిన మొబైల్ ఎటిఎం కాళ్లకూరు సొసైటీ పరిధిలో ఉన్న కాళ్లకూరు, జువ్వలపాలెం, ఏలూరుపాడు గ్రామ రైతులు, ప్రజలకు మంచి సౌకర్యాన్ని కల్పించారు.

నూరుశాతం బకాయిల వసూలు..

ఇబ్బా శ్రీనివాస్, సొసైటీ కార్యదర్శి, కాళ్లకూరు

కాళ్లకూరు సొసైటీలో ఇచ్చిన రుణాలు నూరుశాతం వసూలుకు సహకరించిన సంఘసభ్యులకు, డిసిసిబి వారికీ, సహకార సంఘ అధికారులకు, సంఘ సిబ్బందికి, రైతులకు ప్రత్యేక కృతజ్ఞతలు. ప్రతి ఏటా డిపాజిట్లు పెరిగాయి. సొసైటీ ద్వారా రైతులకు, ప్రజలకు విస్తృత సేవలు అందిస్తున్నాం. సొసైటీ పనితీరు, సొసైటీ ప్రగతి బాగుంది. ఇటీవల ప్రభుత్వం త్రిసభ్య కమిటీ సభ్యులను రద్దుచేసి ఆఫీసియల్ పర్సన్ ఇన్‌ఛార్జి కె.వర్జినిని నియమించారు.

సార్వా సాగుకు అనువైన రకాలివే..

మార్టేరు ఫారం ఎడిఆర్ డాక్టర్ టి.శ్రీనివాస్

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఉభయగోదావరి జిల్లాల్లో స్వర్ణ, ఎంటియు 1318, సంపదస్వర్ణ వంటి రకాలను సాగుచేస్తున్నారని, వీటికి ప్రత్యామ్నాయంగా సాగుచేయదగ్గ రకాలు వాటి గుణగణాల గురించి మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ పరిశోధనా సంచాలకులు డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఆ రకాల గుణ గణాలను ఆయన వివరించారు.

శ్రావణి(ఎంటియు 1239): సార్వాలో ఎంటియు 1318, స్వర్ణ, ఎంటియు 1064, ఎంటియు 1061, సంపద స్వర్ణ రకాలకు ప్రత్యామ్నాయంగా సాగుచేయదగ్గ తెలుపు గింజ రకము 140 రోజుల పంటకాలం కలిగి ఉంటుంది. కాండం ధృడంగా ఉండి చేను పడిపోదు. రెండు వారాల నిద్రావస్థ ఉండటం వల్ల అధిక వర్షాల సమయంలో గింజ మొలకెత్తదు. దోమపోటు, ఎండకు తెగుళ్లను తట్టుకుంటుంది. సగటు దిగుబడి హెక్టారుకు 7.0 టన్నులు వస్తుంది.

చంద్ర (ఎంటియు-1153) : ఉభయ గోదావరి జిల్లాలో ముంపు వల్ల సార్వా ఆలస్యమయ్యే ప్రాంతాల్లో సాగుచేయడానికి అనువైన ఎంటియు 1010 ప్రత్యామ్నాయంగా సాగుచేయదగ్గ స్వల్పకాలిక రకము. పంటకాలం 115 రోజులు. గింజ పొడవుగా, లావుగా ఉంటుంది. బియ్యం పొట్ట తెలుపు లేకుండా పారదర్శకంగా ఉండి, గింజ రాలిక తక్కువగా ఉంటుంది. సగటు దిగుబడి హెక్టారుకు 7.5 టన్నులు. దోమపోటు, అగ్గి తెగులును తట్టుకుంటుంది.

ఎంటియు రైస్ 1273: ఉభయగోదావరి జిల్లాల్లో రైతులు సాగుచేస్తున్న పిఆర్ 126, ఎస్ఎల్ 10, ఎంటియు 1064, ఎంటియు 1010 రకాలకు ప్రత్యామ్నాయమైన, 6.66 మి.మీ గింజ పొడవు కలిగి, కాకినాడ పోర్ట్ ద్వారా ఆఫ్రికా దేశాలకు ఎగుమతి చేయడానికి అనువైన రకము. 120 రోజుల కాల పరిమితి కలిగి, చేను పడిపోదు. బియ్యం పారదర్శకంగా ఉండి, గింజ రాలిక తక్కువగా ఉంటుంది. అగ్గి తెగులును కొంతవరకు తట్టుకుంటుంది. సగటున హెక్టారుకు 7.0 నుంచి 7.5 టన్నులు దిగుబడి ఇచ్చే రకము

ఎంటియు రైస్ 1232 : అధిక దిగుబడినిచ్చే శాఖీయ దశలో నాటిన 15 రోజుల నుంచి పిలకలు కట్టే దశ వరకు సుమారు 15 రోజుల పాటు ముంపును తట్టుకునే రకము. పంటకాలం 135-140 రోజులు. దోమపోటు, అగ్గితెగులు, మాగుడు తెగుళ్లను కొంతవరకు తట్టుకుంటుంది. సగటున దిగుబడి హెక్టారుకు 6.0-6.5 టన్నులు. పైన ఉదహరించిన రకాల బ్రీడర్ విత్తనం మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో అందుబాటులో ఉన్నది. 30 కిలోల విత్తన సంచి ధర రూ.2,334, ఈ విత్తనాలు కావలసిన రైతులు పనిదినాల్లో ఉదయం 9 గంటల నుంచి 4 గంటల వరకు కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు. లేదా డాక్టర్ ఎంవి.కృష్ణాజి, ప్రాధాన శాస్త్రవేత్త(విస్తరణ) వారిని ఫోన్ 9848141939 నెంబర్‌లో సంప్రదించవచ్చని ఎడిఆర్ పేర్కొన్నారు.

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పాలకొల్లు రోటరీ క్లబ్ 2024-25కు గాను నూతన కార్యవర్గ సభ్యులను రోటరీ డిస్ట్రిక్ట్ 3020 అసిస్టెంట్ గవర్నర్ ముత్యాల శ్రీనివాసు, పాస్ట్ ప్రెసిడెంట్ పెనుమాక రామోన రావు అధ్యక్షతన రోటరీ సభ్యుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రోటరీ క్లబ్ నూతన అధ్యక్షునిగా ఉల్లంపర్రు గ్రామానికి చెందిన రావాడ సతీష్‌ను ఎన్నుకున్నారు. సెక్రటరీగా జవ్వాజి కళ్యాణ్, ట్రెజరర్‌గా పోతబత్తుల సత్యనారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు రావాడ సతీష్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ అనేది ఒక ఇంటర్నేషనల్ సేవా సంస్థ, ఈ సంస్థ ద్వారా సవంత్సర కాలం పాటు సేవా కార్యక్రమాలు చేయడానికి అవకాశం కలిపించిన రొటరీ మిత్రులకు ముందుగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మద్దాల శ్రీనివాస్, మద్దాల రాం ప్రసాద్, కటారి నాగేంద్ర కుమారు, ఇమ్మిడి రాజేష్, కావలి నగేష్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో అన్నా క్యాంటీన్‌ను కొనసాగిస్తాం..

నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మండలంలో అన్నా క్యాంటీన్‌ను అందరి సహకారంతో నిరంతరంగా కొనసాగిస్తామని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి అన్నారు. మంగళవారం తాడేపల్లిగూడెంలోని తాలూకా ఆఫీస్ సెంటర్‌లో అన్నా క్యాంటీన్ వద్ద 88వ మంగళవారం అన్నదానం కార్యక్రమాన్ని పట్టణ 20వ వార్డు టిడిపి ప్రెసిడెంట్ వుల్లంగిల చిన్న దంపతుల ఆర్థిక సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ పేదవాడి ఆకలి తీర్చడానికి టిడిపి ప్రభుత్వం అన్నా క్యాంటీన్ ప్రవేశపెట్టిందన్నారు. దాతల సహకారంతో గత 88 వారాలుగా ఈ అన్నా క్యాంటీన్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జనసేన, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై ఆడిట్

ప్రజాశక్తి - కాళ్ల

ఉపాధి హామీ చట్టం పనులపై సోషల్ ఆడిట్ మంగళవారం నిర్వహించారు. ఎంపిడిఒ జి.స్వాతి అధ్యక్షతన డ్వామా ప్రిసైడింగ్ అధికారిగా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.ప్రభాకర రావు ఆధ్వర్యంలో ఉపాధి హామీ చట్టంపై 17వ విడత సోషల్ ఆడిట్ ప్రజా వేదిక మంగళవారం నిర్వహించారు. ఈ ఆడిట్ 2023 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2024 మార్చి 31 వరకు నిర్వహించారు. మొత్తం 587 పనులుకు వేతన రూపంలో రూ.4,57,69,475 కోట్లు, మెటీరియల్ రూపంలో రూ.1,48,23,016 కోట్లు, మొత్తం రూ.6,05,92,491 కోట్లు ఆడిట్ జరిగింది. ఈ ఆడిట్‌లో రీకవరి రూ.22,652 పెనాల్టీ రూపంలో రూ.4 వేలు విధించారు. ఆ సొమ్ము ప్రభుత్వ ఖాతాకు జమ చేశారు. ఈ ఆడిట్లో భీమవరం క్లస్టర్ ఎపిడి పి.సుజాత, జిల్లా విజిలెన్స్ అధికారి ఎవి.విజయలక్ష్మి, జిల్లా డిఆర్ డిఎ కార్యాలయం నుంచి టి.మురళీకృష్ణ, అధికారులు, ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది, వేతనదారులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ స్వర్ణోత్స మహాసభలు జయప్రదం చేయండి

వీరవాసరం: డిసెంబర్‌లో నిర్వహించే స్వర్ణోత్స మహాసభలను జయప్రదం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపిమూర్తి పిలుపునిచ్చారు. ఈమేరకు మంగళవారం ఆయన వీరవాసరం మండలంలో పర్యటించి యుటిఎఫ్ చేసిన పోరాటాలు, సాధించిన విజయాలను చెప్పారు. యుటిఎఫ్ ఆవిర్భావం నుంచి విద్యారంగం, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంకు అలుపెరగని పోరాటం చేసిందన్నారు. పాలకులు ఎవరున్నా, ఎన్ని నిర్బంధాలు ప్రయోగించినా తట్టుకుని అనేక సమస్యల పట్ల పోరాటం చేసి విజయం సాధించిన ఘనత యుటిఎఫ్‌దేనన్నారు. యుటిఎఫ్ ఏర్పడి యాభై సంవత్సరాలు గడిచిన సందర్భంగా గత ఉద్యమాలను సమీక్షించుకుని భవిష్యత్‌లో ఉపాధ్యాయులో స్ఫూర్తిని నింపడానికి ఈ స్వర్ణోత్సవ మహాసభలు నిర్వహించడానికి ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు విజయరామరాజు, రాష్ట్ర కౌన్సిలర్ జివివి.రామానుజరావు, జిల్లా కార్యదర్శి సిహెచ్.కుమార్ బాబ్జి పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం తల్లులకు డయేరియాపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు డయేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఒఆర్ఎస్ ద్రావణం, జింక్ టాబ్లెట్లు గురించి తెలియజేశారు. రెండు నెలల పాటు ప్రతి గ్రామంలో తమ వైద్య సిబ్బంది స్థానికులకు డయేరియాపై అవగాహన కల్పిస్తారన్నారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవం గురించి పరిశుభ్రతపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్ బాబు, హెచ్‌విసిహెచ్.పద్మజ, మిడ్ లెవెల్ హెల్ప్ ప్రొవైడర్స్, ఎఎన్ఎంలు పాల్గొన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

తాడేపల్లిగూడెం: మండలంలోని వెంకటరామన్నగూడెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి.రూపాదేవి ఆధ్వర్యంలో మంగళవారం స్టాప్ డయేరియా అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈనెల 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు స్టాప్ డయేరియా కార్యక్రమం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న అన్ని గ్రామాల్లో జరుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏ ఒక్కరూ కూడా అతిసార వ్యాధితో మరణాలు సంభవించకుండా చూడటమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ సూర్యకాంతం, హెచ్‌వి జ్యోతిర్మయి, హెచ్ఎస్.లక్ష్మణ్ పాల్గొన్నారు.

మంత్రికి రుణపడి ఉంటాం : తల్లిదండ్రులు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పట్టణ 18వ వార్డుకు చెందిన 13 నెలల పాప వైద్యం విషయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖా మంత్రి నిమ్మల రామానాయుడును పాప తల్లిదండ్రులు కలిసి జన్మంతా రుణపడి ఉంటామంటూ కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. విజయవాడ మణిపాల్ ఆసుపత్రిలో పాపకు సర్జరీ సక్సెస్ అయి క్షేమంగా ఇంటికి రావడంతో ఆమె తల్లిదండ్రులు మంత్రి రామానాయుడును కలిశారు. పాప సర్జరీకి సిఎం సహాయ నిధి నుంచి ఆర్థికపరమైన సాయం అందించడమే కాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మెరుగైన వైద్యం అందేలా స్వయంగా ఆసుపత్రికి వచ్చి వైద్యులతో మాట్లాడడమే కాకుండా మాకు ధైర్యం చెప్పారు అంటూ మంత్రి రామానాయుడు వద్ద అభిమానాన్ని చాటుకున్నారు. ఇటీవల పాప అక్షరను వెంటపెట్టుకొని ఆమె తల్లిదండ్రులు మంత్రిని కలిశారు. 3 నెలల వయసులో కిడ్నీ సమస్యతో ఒకటి తొలగించారని, ఇప్పుడు రెండో దాని వల్ల యూరినల్ పైపు సన్నబడి ఆరోగ్యపరమైన ఇబ్బంది కలిగిందని తెలిపారు. సర్జరీకి రూ.1,50,000 అవుతుందని, పేద కుటుంబానికి చెందిన తాము భరించలేమని ఆవేదన వ్యక్తం చేస్తూ ఆదుకోవాలని కోరారు. దీనిపై చలించిన మంత్రి రామానాయుడు తక్షణం స్పందించి సిఎం కార్యాలయానికి ఫోన్ చేసి పాప పరిస్థితిని వివరించి సిఎం సహాయ నిధి నుంచి సాయం అందేలా చూశారు.

సహకార బ్యాంకు అభివృద్ధికి కృషి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - పాలకోడేరు

పాలకోడేరు సహకార బ్యాంకు అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామ కృష్ణంరాజు అన్నారు. పాలకోడేరు కోఆపరేటివ్ బ్యాంకును జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్యతో కలిసి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యనిర్వాహణాధికారి పివిఎల్ నరసింహారాజు, మాజీ సొసైటీ అధ్యక్షులు కొత్తపల్లి నాగరాజు సొసైటీ ద్వారా అందిస్తున్న సేవలకు సంబంధించిన వివరాలను వివరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ సొసైటీ ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించడం అభి నందనీయమన్నారు. రైతులు సొసైటీ అభివృద్ధి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. సొసైటీ ద్వారా రైతులకు మరిన్ని సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, సొసైటీ అధికారులు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

సహకార బ్యాంకు వివరాలను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ

కాలువల నిర్వహణ నిధికి ఎంపిపి విరాళం

ప్రజాశక్తి - పాలకోడేరు

ఉండి నియోజకవర్గంలో పంట కాలువలు, డ్రెయినేజి నిర్వహణ పనుల నిధికి పాలకోడేరు ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు(చంటిరాజు) రూ.లక్ష విరాళం ప్రకటించారు. మంగళవారం పాలకోడేరు సొసైటీలో జరిగిన ఒక కార్యక్రమంలో విరాళం చెక్కును ఆయన స్థానిక ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజుకు అందజేశారు. మండలాభివృద్ధికి పార్టీలకు అతీతంగా సహకరిస్తానని ఈ సందర్భంగా చంటిరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షులు కొత్తపల్లి నాగరాజు, సొసైటీ కార్యనిర్వహణ అధికారి పివి.నరసింహారాజు, నాగరాజు, ఏడుకొండలరాజు పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో మొక్కలు పెంచాలి

పాఠశాల ఆవరణలో పచ్చటి మొక్కలను పుష్కలంగా పెంచడం వల్ల ఆహ్లాదంతో పాటు పిల్లలకు చక్కటి ఆరోగ్యం సిద్ధిస్తుందని ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు తెలిపారు. పాలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్థానిక టిడిపి నాయకుడు మురళీకృష్ణంరాజు సౌజన్యంతో ఏర్పాటు చేస్తున్న గార్డెన్‌ను మంగళవారం ఎంఎల్ఎ కనుమూరు, జెసి సివి ప్రవీణ్‌ఆదిత్య, విద్యాశాఖ ఆర్‌జెడి నాగమణి ప్రారంభించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. అనంతరం స్థానిక వ్యవసాయ సహకార సంఘాన్ని ఆయన సందర్శించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పాల్గొన్నారు.



ఎంఎల్ఎకు చెక్కునందిస్తున్న ఎంపిపి

విద్యార్థులకు నోటు పుస్తకాలు, డైరీల పంపిణీ

ప్రజాశక్తి - గణపవరం

మండలంలోని జల్లికొమ్మర యుపి పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం గడపవాని ఫ్యాన్స్ నిర్వాహకులు నాగ వెంకటకృష్ణ డైరీలు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేటి సుందర కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతల సహకారం మరువలేనిదన్నారు.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, తణుకు మండలం, మండపాక గ్రామానికి చెందిన రత్న అనూష (పాస్‌పోర్టు నెంబర్: T0932883) జిరాక్స్ నిమిత్తం మండపాక నుండి తణుకు టౌన్‌కి వెళ్తుండగా మార్గ మధ్యలో పడిపోయినది. దొరికినవారు ఈక్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

అడ్రస్:
రత్న అనూష, W/o. శ్రీనివాస్
డోర్ నెంబర్: 3-98/2,
Near: ఎల్లారమ్మ అమ్మవారి దేవస్థానం
VTC మండపాక రూరల్, మండపాక గ్రామం
తణుకు మండలం, పశ్చిమగోదావరి జిల్లా
పిన్: 534128, సెల్: 90597 88077

పత్రికా ప్రకటన

మా క్లయింటు దంపనబోయిన శంకర్, ఏలూరు మండలం, ఏలూరు వాస్తవ్యులు మాకు ఇచ్చిన సమాచారం ప్రకారం తెలియచేయునది ఏమనగా, లేటు దంపనబోయిన వెంకట రమణరావు ది. 10-7-2016న దంపనబోయిన శంకర్ పేరున వ్రాసిన వీలునామా ప్రకారం 1 ఎకరం భూమి పాలగూడెం ఆర్.ఎస్. 362, డాక్యుమెంటు నెం. 526/1987 మరియు పత్తేబాదలోని టి.ఎస్. నెం. 47/5 & 6, డోర్ నెం. 24ఎ-28-4 ఇంటి వాటా, నాటి నుండి నేటి వరకు మా క్లయింటు హక్కు భుక్తంలో ఉన్నది. పైన పేర్కొనబడిన సదరు ఆస్తులపై ఎవరైన ఏవిధమైన అక్రమ చర్యలకు పాల్పడిన యెడల అట్టి వారిపై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకొనబడును.

షెడ్యూలు
1. **తూర్పు:** పంట బోదీ. **పడమర:** ఆంజనేయస్వామి వారి భూమి. **దక్షిణం:** డి.శంకర్. **ఉత్తరం:** జంగా రామయ్య గారి భూమి.
2. **తూర్పు:** రోడ్డు. **పడమర:** శంకర్. **దక్షిణం:** లేటు బాలభాస్కర్, **ఉత్తరం:** రోడ్డు.

ఎన్.అమరనాధం
అడ్వకేటు, ఏలూరు

దావా సమను
మహారాజశ్రీ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, పాలకొల్లు
O.S. No. 158/2020

బిట్వీన్:
బూరాడ శ్రీనివాసరావు -వాది
Vs
కుసుమే విజయకుమారి -ప్రతివాది

To:
ప్రతివాది: కుసుమే విజయకుమారి, W/o. సుధాకర్ శ్యామ్‌బాబు, ఎల్‌టి కంప్యూటర్స్, ప్రైమరీ హెల్త్ సెంటర్, మొగల్తూరు, మొగల్తూరు మండలం, ప॥గో॥జిల్లా.

పై నెంబరు దావాలో ప్రతివాది హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు పై నెంబరు దావాను ది. 25-07-2024 కు వాయిదా వేసినారు. కాబట్టి ప్రతివాది పై నెంబరు దావాలో **ది. 25-07-2024వ తేదీన ఉదయం 10.30 గం॥లకు** స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు కావలెను. అట్లు హాజరు కానిచో ప్రతివాది పరోక్షమందు పై నెంబరు దావాను శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు అని తెల్పడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
యమ్.వెంకట రామారెడ్డి
పాలకొల్లు అడ్వకేటు
తేది.02-7-2024 సెల్: 9440110677

మహారాజశ్రీ ఏలూరు మొదటి అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
I.A. No. 1/2023 in O.S. No. 311/2018

Between:
మల్లవరపు రామలింగేశ్వరరావు -పిటీషనరు/వాది
మరియు
నెక్కలపు సరోజిని (died) మరియు వగైరాలు -రెస్పాండెంటు/ ప్రతివాదులు

To:
నెక్కలపు సీతమ్మ, D/o. నెక్కలపు మధుసూదనరావు, R/o. 1వ రోడ్డు, పుష్పలీలా నగర్, చింతలపూడి రోడ్డు, తంగెళ్ళమూడి, ఏలూరు, ఏలూరు జిల్లా.

పై నంబరు దావా గ్రంథంలో చనిపోయిన ప్రతివాది నెక్కలపు సరోజిని స్థానంలో మిమ్మల్ని వారసులుగా చేర్చమని కోరుచూ పిటీషను దాఖలు చేసినందున మీకు కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ పత్రికా ముఖంగా నోటీసు అమలుకు వాయిదా అయివున్నది. కావున వాయిదా **తేదీ 01-08-2024న ఉదయం 10.30 ని॥లకు** పైన తెలిపిన కోర్టు వారి ఎదుట హాజరవగలరు. లేనిచో మీ పరోక్షమందు తీర్మానించబడును.

జి.వి.నాగేశ్వరరావు
జి.లక్ష్మయ్య
ఏలూరు న్యాయవాదులు, ఏలూరు
ది.02-7-2024 సెల్: 9440988449

ప్రకటన
మహారాజశ్రీ పాలకొల్లు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S. No. 168/2023

Between:
మద్దింశెట్టి బలరాముడు -వాది
మరియు
అడ్డాల సత్యనారాయణ (died) వగైరా -ప్రతివాదులు

D-4: అడ్డాల శివ, S/o. సత్యనారాయణ, డో.నెం. 3-53 & 3-53/1, చాకలివారి పేట, గుమ్ములూరు

పై నెంబరు దావాలో ఎన్ని పర్యాయములు శ్రీ కోర్టు వారు మీకు ఎన్ని నోటీసులు పంపించినప్పటికి మీరు ఉద్దేశ్యపూర్వకముగా సమన్లు అందుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు ఈ పేపర్ ద్వారా మీకు నోటీసు జారీ చేసియున్నారు. దావా **ది. 25-7-2024వ తేదీనకు వాయిదా అయివున్నది.** కావున మీరు వ్యక్తిగతంగా గాని లేదా మీ పరోక్షమున ప్లీడరు గారి ద్వారా గాని కోర్టులో హాజరు అయ్యి మీ వాదన దాఖలు చేసుకొనవలెను. సదరు వాయిదాకు మీరు హాజరు కాని యెడల మీ పరోక్షమున దావా గ్రంథము జరుపబడునని తెలియచేయడమైనది.

(By Order)
పి.డి.యస్.వి.బాలాజి
న్యాయవాది, పాలకొల్లు
తేది.28-06-2024 సెల్: 94904 33732